క్లుప్తంగా

పోర్ట్‌ఫోలియో జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు



పోర్ట్‌ఫోలియో జడ్జికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

చివ్వెంల : సూర్యాపేట జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ రాధారాణిని శుక్రవారం సూర్యాపేట బార్ అసోసియేషన్ సభ్యులు హైదరాబాద్ హైకోర్టులోని ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, ఉపాధ్యక్షుడు గుంటూరు మధు, ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు, కోశాధికారి ఎండీ అబ్దుల్ లతీఫ్, ఈసీ సభ్యుడు మంచినీళ్ల లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతితో బాధ్యతలు పెరుగుతాయి

● ఎస్పీ నరసింహ



పదోన్నతి పొందిన సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్: ప్రమోషన్‌తో బాధ్యతలు కూడా పెరుగుతాయని ఎస్పీ నరసింహ అన్నారు. హెడ్ కానిస్టేబుళ్ల నుంచి ఏఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన ఆరుగురిని శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతలకు అనుగుణంగా విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఉత్తమ సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ప్రమోషన్ పొందిన వారిలో వెంకన్న (సీసీఎస్ పోలీస్ స్టేషన్), మల్లయ్య (మద్దిరాల పోలీస్ స్టేషన్), గౌరీ శంకర్ (మిర్యాలగూడ రూరల్), సోమయ్య (నల్లగొండ సీసీఎస్), శ్రీనివాస్ రెడ్డి (షీ టీం నల్లగొండ), శ్రీనివాస్ (కోదాడ రూరల్ పీఎస్) ఉన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ నరసింహ చారి, పోలీస్ సంఘం అధ్యక్షుడు రామచందర్ గౌడ్, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా టాలెంటోత్సవం

సూర్యాపేటటౌన్ : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను, సృజనాత్మకతను వెలికి తీసి వారిని మరింత ప్రోత్సహించేందుకే టాలెంటోత్సవ్‌ను నిర్వహించినట్లు సిటీ విద్యాసంస్థల చైర్మన్ ఆర్.ప్రకాష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సిటీ హైస్కూల్‌లో నిర్వహించిన టాలెంటోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మురళీధర్, సిటీ ఎలైట్ స్కూల్ ప్రిన్సిపాల్ వి.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న చామంతినరేష్

తిరుమలగిరి : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే సామేల్‌కు, రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయికి మార్కెట్ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతినరేష్ శుక్రవారం వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఆమె వెంట డైరెక్టర్లు రాపాక సోమేష్, హఫీజ్, తదితరులు ఉన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

అర్వపల్లి : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగే గద్దర్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం అర్వపల్లిలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం జిల్లా నాయకులు యలగందుల మల్లేష్‌నేత, దడిపల్లి వెంకట్, ఈదురు వీరపాపయ్య, దిర్శనపు కృష్ణమూర్తి, కొమారి మల్లయ్య, యల్లయ్య, కె.వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ పనులు

అర్వపల్లి : మండలంలోని తిమ్మాపురం గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో శుక్రవారం గ్రీన్ డే కార్యక్రమం సందర్భంగా మొక్కల సంరక్షణ పనులు చేట్టారు. ఈ సందర్భంగా పల్లె ప్రకృతి వనంలోని మొక్కలకు ఎంపీడీఓ టి.గోపి నీళ్లు పోశారు. ప్రతి శుక్రవారం గ్రీన్ డే కార్యక్రమాన్ని నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ బి. లింగయ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

అర్వపల్లి : జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని ఎంపీడీఓ టి.గోపి అన్నారు. శుక్రవారం అడివెలంలో ఉపాధి పనులను పరిశీలించారు. అలాగే కాసర్లపహాడ్ గ్రామంలో వననర్సరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నెహ్రూ నాయక్, గుండగాని మహాలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ చెరుకు గంగ, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

అంధకారంలో అంజనాపురి కాలనీ



వీధిలైట్లు లేక చీకటిగా ఉన్న కాలనీ

సూర్యాపేట అర్బన్ : పట్టణంలోని మానస నగర్, అంజనాపురి కాలనీలలో గత వారం రోజుల నుంచి వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో కాలనీవాసులు రాత్రి పూట బయటికి వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. పాములు, విష పురుగులు సంచరిస్తున్నాయని కాలనీవాసులు తెలిపారు. విద్యుత్ అధికారులు స్పందించి వీధిలైట్లు వెలిగేలా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కమ్ముకుంటున్న మబ్బులు.. రైతుల్లో గుబులు



మండల కేంద్రంలో ధాన్యం రాసులపై పట్టాలు కప్పుతున్న రైతులు

ఆత్మకూర్ (ఎస్) : ఆకాశంలో మబ్బు పడితే రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. యాసంగి వరి పొలాలు కోత దశకు వచ్చిన సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయి మబ్బులు కమ్ముకుంటుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలో వాతావరణం ఒక్కసారిగా మారి గాలి దుమారం ప్రారంభమైంది. దీంతో రైతులు ఐకేపీ కేంద్రంలో పోసిన వరి ధాన్యం రాసులపై పట్టాలు కప్పేందుకు పరుగులు తీశారు.

భూ సేకరణలో రైతులకు న్యాయం చేస్తాం

తిరుమలగిరి : భూ సేకరణలో రైతులకు న్యాయం చేస్తామని, రైతులంతా ప్రభుత్వానికి సహకరించాలని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు అన్నారు. 11ఆర్ కెనాల్ పరిధిలో కాల్వల తవ్వకం కోసం భూసేకరణపై శుక్రవారం తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. మార్కెట్ రేట్ ప్రకారం ధరలు చెల్లించాలని, తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రైతుల వినతిని జిల్లా అధికారులకు తెలియజేసి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరిప్రసాద్, సర్వేయర్ జోసఫ్ పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



కోర్టు ఎదుట రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న న్యాయవాదులు

చివ్వెంల : గోదావరిఖని బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది నూతి సురేష్‌పై దుండగులు చేసిన దాడిని నిరసిస్తూ శుక్రవారం సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. న్యాయవాదులపై రోజు రోజుకూ దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లును ప్రవేశపెట్టి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట్ల అయోధ్య, వసంత సత్యనారాయణ పిళ్లే యాదవ్, బాణాల విజయ్ కుమార్, పి.నర్సింగరావు, శంకరయ్య, విద్యాసాగర్, గద్దల శ్రీను, చంద్రకాంత్, పోలోజు మధు, అనంతుల సందీప్, సుంకర రవికుమార్, సోమన్న, జటంగి శ్రీనాథ్ యాదవ్, సరిత తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఫలితాల్లో సత్తా చాటిన గిరిజన విద్యార్థులు

చివ్వెంల : మండల పరిధిలోని మంగళితండా ప్రాథమిక పాఠశాలకు చెందిన గిరిజన విద్యార్థులు గురుకుల పాఠశాల ఫలితాల్లో సత్తాచాటారు. ఫిబ్రవరి 23న పరీక్షలు నిర్వహించగా, ఏప్రిల్ 3న ఫలితాలు వెల్లడించారు. పాఠశాలకు చెందిన నాలుగవ తరగతి విద్యార్థులు ధరావత్ లోకేష్, ధరావతు నితిన్, ధరావత్ వైష్ణవి, ధరావత్ లాస్య, ధరావత్ కావేరి ఉత్తీర్ణత సాధించి సీట్లు పొందినట్లు హెచ్‌ఎం పాదిల రవిందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అర్వపల్లి : సీఎం సహాయనిధి పేదలకు వరమని డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారి అన్నారు. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో శుక్రవారం ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సహకారంతో బింగి లింగమల్లు, మర్రి రాధిక, నర్సింగ జ్యోతి, మేకల సోమక్క, గోళ్ల జయశీల, ఆవుల రాజశేఖర్‌లకు మంజూరైన మొత్తం రూ. 2,44,500 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, నర్సింగ కృష్ణమూర్తి, బింగి కృష్ణమూర్తి, మామిడి సత్యనారాయణ, కొమిరెల్లి, బాబూ రావు, శ్రీనివాస్, నాగరాజు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి



సూర్యాపేట అర్బన్ : మాట్లాడుతున్న నాయకులు



నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

సూర్యాపేట అర్బన్ : చత్తీస్‌గఢ్‌లో ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్ కుమార్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని చంద్రపుల్లా రెడ్డి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హత్యాకాండకు తెగబడుతున్నాయని అన్నారు. అనంతరం ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి. కోటేశ్వరరావు మాట్లాడుతూ చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నిర్వహిస్తున్న హత్యాకాండను దేశంలోని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు, ఆలోచనపరులు తీవ్రంగా వ్యతిరేకించాలని అన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో డాక్టర్ రంగా రెడ్డి, టీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి ధర్మార్జున్, భద్రయ్య, సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ బూర వెంకటేశ్వర్లు, ఎస్‌కే కరీం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నల్లెడ మాధవ రెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, రాష్ట్ర నాయకులు చామకూరి నరసయ్య, బుద్ధ సత్యనారాయణ, ప్రతాప్, ఆవుల నాగరాజు, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోటు లక్ష్మయ్య, బొడ్డు శంకర్, కునుకుంట్ల సైదులు పాల్గొన్నారు.

అంబానీ, ఆదానీలకు దోచిపెట్టేందుకే..

అంబానీ, ఆదానీలకు దోచిపెట్టడమే ఆపరేషన్ కగార్ లక్ష్యమని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ దగ్గర ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కారింగుల వెంకన్న, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్ కుమార్, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పేర్ల నాగయ్య, పార్టీ సూర్యాపేట డివిజన్ కమిటీ సభ్యులు ఎస్‌కే సయ్యద్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు మారసాని చంద్రకళ, సహాయ కార్యదర్శి ఒంటికొమ్ము సంతోషిమాత, కోశాధికారి మోటకట్ల జయమ్మ, నాయకులు వల్దాస్ జానయ్య, శ్వేత, చిట్టి, శ్రీరామ్, యేసు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

● మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి

తాళ్లగడ్డ (సూర్యాపేట) : స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన బీజేపీ నాయకుల సమావేశానికి హాజరై మాట్లాడారు. సబ్‌కాసాత్ సబ్‌కా వికాస్ బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమని తెలిపారు. భారత్‌ను ప్రధాని మోదీ ప్రపంచంలోనే అభివృద్ధికి ఐకాన్‌గా తీర్చిదిద్దారని అన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎండ్ల అశోక్‌రెడ్డి మాట్లాడారు. చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేసే పార్టీ బీజేపీ అన్నారు. రైతులకు ఉగాది పండుగ ఎలాగో బీజేపీ కార్యకర్తలకు ఏప్రిల్ 6న నిర్వహించే సంస్థాపన దినోత్సవం కూడా అలాంటిదేనని పేర్కొన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి మాట్లాడారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ గురించి మండలాల్లో వర్క్‌షాప్‌లు నిర్వహించి కార్యకర్తలకు, ప్రజలకు అవగాహన కలిగించాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు రుక్మారావు, చలమల నర్సింహ, కనగాల వెంకటరమణ, సులోచన, యశ్వంత్, సాయిబాబా, ధరావత్ సంతోష్ నాయక్, కుక్కడపు వెంకన్న, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

భారత్‌పై విధించిన సుంకాలు రద్దుచేయాలి



ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

సూర్యాపేట అర్బన్ : అమెరికా భారత్‌పై విధించిన సుంకాలను వెంటనే రద్దు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒకవంతుల కోటేశ్వరరావు మాట్లాడారు. భారతదేశం నుంచి ఎగుమతి అయ్యే వ్యవసాయ ఉత్పత్తులపై అదనపు సుంకాలను విధించడం వల్ల భారత వ్యవసాయ రంగానికి నష్టం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.డేవిడ్ కుమార్, పోటు లక్ష్మయ్య, బొడ్డు శంకర్, గంట నాగయ్య, కునుకుంట్ల సైదులు, పెద్దింటి రంగారెడ్డి, పోలేబోయిన కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ ఏర్పాటు చేయడం అభినందనీయం



నల్లా నీటిని ప్రారంభిస్తున్న మున్సిపల్ డీఈ సత్యారావు, పాల్గొన్న సువెన్ ఫార్మా ప్రతినిధులు

సూర్యాపేట అర్బన్ : వేసవిలో మంచినీటి సమస్యను పరిష్కరించడానికి సువెన్ ఫార్మా వారు కొత్త పైపులు వేయడం అభినందనీయమని సూర్యాపేట మున్సిపల్ డీఈ సత్య రావు అన్నారు. శుక్రవారం సువెన్ ఫార్మా వారి సహకారంతో వస్రాంతండాలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ నూతన పైప్ లైన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. నీటిని వృథా చేయకుండా సద్వినియోగ పరుచుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సువెన్ ఫార్మా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ బాబు, మున్సిపల్ అధికారి ప్రసాద్, హెచ్‌ఆర్ వెంకటరమణ, సైదులు, జీవన్, బానోతు కృష్ణ, ధరావత్ సైదా నాయక్, చక్రు నాయక్, శివరాం, సేవ్యా నాయక్ పాల్గొన్నారు.

పొలాల్లో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన



ఎండిన వరి పొలంలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

తుంగతుర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువుతో పొలాలన్నీ ఎండిపోయి రైతులు అప్పుల పాలయ్యారని గుడితండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఎండిన పొలాల్లో శుక్రవారం పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాడికొండ సీతయ్య మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి రైతులకు, మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని కూడా ఈ 16నెలల పాలనలో నెరవేర్చలేదని అన్నారు. ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం దగాపాలన చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు గుండగాని రాములు గౌడ్, మండల నాయకులు దొంగరి శ్రీనివాస్, మట్టిపల్లి వెంకట్, సర్పంచ్ భారతి పుణ్యానాయక్, గ్రామ అధ్యక్షుడు గుగులోతు రవి నాయక్, రైతులు పాల్గొన్నారు.

ఏక్ భారత్ - శ్రేష్ఠ భారత్

పెన్‌పహాడ్ : భారతదేశంలోని భిన్న సంస్కృతులపై అవగాహన పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఏక్ భారత్ - శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నకిరేకంటి రవి మాట్లాడారు. విద్యార్థులలో భిన్న సంస్కృతులపై ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు.

ఇంటి నిర్మాణం పరిశీలన

తిరుమలగిరి : తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో జరుగుతున్న మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను శుక్రవారం సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు పరిశీలించారు. ఆయన వెంట తిరుమలగిరి తహసీల్దార్ హరిప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ జాన్‌మహ్మద్, సర్వేయర్ జోసఫ్, తదితరులు ఉన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడిగా హుస్సేన్ నాయక్



నియామకపత్రం ఇస్తున్న మల్లేష్‌యాదవ్

తాళ్లగడ్డ : బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బుడిగ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ధరావత్ హుస్సేన్ నాయక్‌ను నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా ధరావత్ హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌ను కలిసిన నాయకులు



ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ దంపతులను సన్మానిస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

నూతనకల్ : ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ జన్మదినోత్సవంలో మండల యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో అద్దంకి దయాకర్ దంపతులను భారీ గజమాలతో సన్మానించా రు. కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నల్లెడ తిర్మల్‌రెడ్డి, బాలా జీనాయక్, చిత్తలూరి కార్తీక్‌గౌడ్, బాణోతు గణేష్, నిశిత్, సైదులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మద్దిరాల : మండల ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల డీలర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.

రాజ్యాంగ పరిరక్షణ యాత్ర విజయవంతం చేయాలి

అర్వపల్లి : రాజ్యాంగ పరిరక్షణ యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి కోరారు. అర్వపల్లిలోని దేవస్థాన ఆవరణలో శుక్రవారం జాజిరెడ్డిగూడెం మండల సమావేశం నిర్వహించారు. జై బాపు జై భీం జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కోఆర్డినేటర్ జీడి వీరస్వామి ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన చేపట్టే యాత్రల తేదీలను నిర్ణయించారు. ఈ సందర్భంగా యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, మండల కోఆర్డినేటర్ జీడి వీరస్వామి, పాలెల్లి సురేష్, గంగదెరి శ్రీను, జాల నర్సయ్య, ఏఎంసీ డైరెక్టర్లు బి.సైదులు, జలేందర్, దిర్శనపు కృష్ణమూర్తి, నల్లగుంట్ల శ్రీనివాస్, సురేందర్, యాదగిరి, చిరంజీవి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం



ఆత్మకూర్(ఎస్) : స్వపరిపాలన వేడుకలో పాల్గొన్న విద్యార్థులు



అర్వపల్లి : ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఆత్మకూర్ (ఎస్) : ఏపూరు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా, ఉపాధ్యాయులుగా అభినయించి అబ్బురపరిచారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ధారా సింగ్, హెచ్‌ఎం బాసిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం 5వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.యాకలక్ష్మి, ఉపాధ్యాయులు కుంభం రేణుక, భూపతి స్వరూపరాణి, శైలజ పాల్గొన్నారు.

దాయం విక్రమ్‌రెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న వెంపటి గ్రామస్తులు

తుంగతుర్తి : మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన కమ్యూనిస్టు యోధుడు దాయం విక్రమ్ రెడ్డి (73) శుక్రవారం మృతి చెందారు. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. దాయం విక్రమ్ రెడ్డి వెంపటి గ్రామ సర్పంచ్‌గా, తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 40 సంవత్సరాల తన రాజకీయ జీవితంలో వెంపటి గ్రామ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారు.

జయ స్కూల్‌లో కిండర్‌గార్టెన్ కాన్వొకేషన్



కిండర్‌గార్టెన్ కాన్వొకేషన్‌లో పాల్గొన్న విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : ప్రతి విషయం చెప్పే స్వేచ్ఛను తల్లిదండ్రులు పిల్లలకు కల్పించాల ని జయ స్కూల్ కరస్పాండెంట్ జయవేణుగోపాల్ అన్నారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని జయ స్కూల్‌లో కిండర్‌గార్టెన్ కన్వకేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్ బింగి జ్యోతి, జెల్లా పద్మ, తదితరులు పాల్గొన్నారు.

● మల్లన్న ఆలయంలో యంత్ర ప్రతిష్ఠాపనోత్సవం



నూతనకల్ : తాళ్లసింగారంలోని మల్లన్న ఆలయం వేడుకల్లో పాల్గొన్న భక్తులు

సైబర్ నేరాల నియంత్రణపై కళాజాత

నూతనకల్ : సైబర్ నేరాలు, మత్తు పదార్థాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సాంస్కృతిక సా రథి జిల్లా టీమ్ లీడర్ పాలకుర్తి శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం తాళ్లసింగారంలో ఏర్పాటు చేసిన కళా జాతలో పాల్గొని మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్, బెట్టింగ్ యాప్‌ల వల్ల జరిగే నష్టాలను ప్రజలకు కళారూపాల ద్వారా వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ

సూర్యాపేట : తెలంగాణ ఉద్యమ నేత, తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేపల్లి కుమార్ జన్మదినం సందర్భంగా తెలంగాణ యువజన సంఘం ఆధ్వర్యంలో సూర్యాపేట మండల పరిధిలోని అపూర్వ దివ్యాంగుల రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనంతుల మధు, ఏనిగా సంతోష్ రెడ్డి, ధరావత్ వెంకటేష్ నాయక్, బంటు సందీప్, వాసు పాల్గొన్నారు.